బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణను కేసీఆర్ కన్నా ప్రేమించేదెవరు?

తెలంగాణలో బీఆర్ఎస్‌ను కాదని గెలువాలంటే కేసీఆర్ కన్నా తెలంగాణను ఎక్కువ ప్రేమించాలి. ఇది మంత్రి కేటీఆర్ తరచూ చెప్పే మాట. ఈ మాట విన్నప్పుడల్లా ఇది అక్షరసత్యం అనిపిస్తుంటుంది. కేసీఆర్ కన్నా తెలంగాణను ప్రేమించే వ్యక్తి ఎవరున్నారని ఎంతగా ఆలోచించినా సరే ఒక్కటంటే ఒక్క పేరు గుర్తు రాదు.

ఈ రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే ఏమి చేయాలో నిజానికి ప్రతిపక్షాలకు హింట్ కూడా ఇవ్వకూడదు. కానీ కేటీఆర్‌ది కొంచెం ఉదార స్వభావం. అందుకే తెలంగాణ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రతిపక్షాలు చేయాల్సిన ప్రధానమైన పనేంటో ఎప్పుడో చెప్పేశారు. అయినా సరే కీలకమైన ఈ అంశం వాళ్లకు ఏమాత్రం అర్థమైనట్టు లేదు. ఇప్పటికీ తెలంగాణ మనసేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తలేరు. ఎన్నికలు రాగానే కాస్త హడావుడి చేసేస్తేనో..కేసీఆర్‌ను నాలుగు మాటలంటేనో విజయం సాధిస్తామన్న భ్రమలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రజల చేతిలో ప్రతిసారీ ఎదురుదెబ్బలు తింటూనే ఉన్నారు.

అసలు కేసీఆర్‌తో తెలంగాణ ప్రజలది పేగుబంధాన్ని మించిన ప్రేమబంధం. ఆయనలా ఈ ప్రాంతాన్ని, ఇక్కడి ప్రజలను ప్రేమించే వారు విపక్షాల్లో దుర్భిణీ పెట్టి వెతికినా సరే కనుచూపు మేరలో కనబడరు. కేసీఆర్ రాజకీయాలు ఓట్ల చుట్టు కాదు. ప్రజల చుట్టూ తిరుగుతాయి. అందుకు ఆయన తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని ఉదాహరణగా చెప్పొచ్చు. ఒక్క రైతుల విషయాన్నే తీసుకుందాం. వాళ్లకు సాగునీరో, కొంత ఆర్థిక సాయం చేసి ఇక చాలని భావించలేదు. మొత్తం తెలంగాణ రైతు బాగుపడాలంటే ప్రభుత్వం తరపున ఎన్ని చేయాలో అన్ని దారులు వెతికిండు. రోజుల తరబడి మేధోమథనం చేసిండు. మిషన్ కాకతీయ అన్నాడు. భారీ ప్రాజెక్టులు చేపట్టిండు. రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ, వరిధాన్యం కొనుగోలు ఇలా రైతు రాజు కావటానికి ఎంత దూరమైనా వెళ్లిండు. ఫలితం తెలంగాణ ఇప్పుడు వరి ఉత్పత్తిలో నంబర్ వన్. ఇందులో ఒకటి, రెండు పనులు చేసేసి రైతులకు మాకన్నా ఎక్కువ ఎవలు చేయలే అని ప్రచారం చేసుకున్న వాళ్లెందరో. కానీ కేసీఆర్ వేరు. చిత్తశుద్ధితో మంచి చేస్తే ప్రజలే మన కన్నా ఎక్కువ ప్రచారం చేస్తారని నమ్ముతారు.

కేసీఆర్ ఏ అంశాన్ని తలకెత్తుకున్నా దాని అంతుచూడకుండా వదలడు. అది ప్రజలకు మంచి చేస్తుందంటే ఇంకా మొండి పట్టుదలకు పోతాడు. తెలంగాణకు ఏం అవసరమో, అది ఎలా చేయాలో కేసీఆర్‌కు ఉన్నంత స్పష్టత మరెవ్వరికీ లేదు. ఆయన పాలనలో మానవీయత కలగలిపి ఉంటుంది. అందుకే ప్రజలు ఏ ఒక్కరూ డిమాండ్ చేయకుండానే ఎన్నో సంక్షేమాలను అందించారు. కంటివెలుగు కార్యక్రమం, బడి పిల్లలకు అల్పాహారం, వికలాంగులకు 4 వేల పింఛన్, కేసీఆర్ కిట్, కేసీఆర్ పౌష్టికాహారం లాంటి వెన్నో ఆయన మానవీయతకు అద్దం పట్టే కార్యక్రమాలే. ఏ వర్గానికి ఏది సంక్షేమమో అది అందించేందుకు కేసీఆర్ అందరికన్నా ఎక్కువ తాపత్రయపడతారు. అందుకే తొమ్మిదిన్నరేండ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమాలు తెలంగాణ ప్రజల చెంతకు చేరాయి. ఇవే కార్యక్రమాలను ఇతర పార్టీలు చేసి ఉంటే ఒక్కో ఎలక్షన్‌కు ఒక్కో సంక్షేమ పథకం చొప్పున వందేండ్లపాటు వీటిని వాడుకునే వారు. కానీ కేసీఆర్‌కు ప్రజల మీద ఉన్న ప్రేమ కారణంగానే పదంటే పదేండ్లలో ఇవన్నీ సాధ్యమయ్యాయి.

సంక్షేమమొక్కటితోనే బండి నడవదు. ఎంత సంక్షేమ ముంటదో అంతకన్నా ఎక్కువ అభివృద్ధి కావాలె అంటాడు కేసీఆర్. అలా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తన మేధస్సు మొత్తాన్ని పణంగా పెట్టిండు. గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, టీఎస్ ఐపాస్, రోడ్ల నిర్మాణం, లా అండ్ ఆర్డర్‌ను అదుపులో ఉంచటం, 24 గంటల కరెంట్, పెట్టుబడుల ఆకర్షణ, విద్య, వైద్యం, జిల్లాల విభజన ఇలా అన్ని రంగాల్లో తను తీసుకున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన లెక్కలు చెప్పాలంటే ఒక్కో కార్యక్రమానికి ఒక్కో పుస్తకం రాయాలె. అందుకే ఆ లెక్కల జోలికి పోవట్లే. అసలు తెలంగాణ ఏర్పడటం అంతా ఒక ఎత్తయితే..సాధించుకున్న రాష్ట్రాన్ని నిలబెట్టుకోవటం అంతకన్నా పెద్ద టాస్క్. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో కేసీఆర్ పదే పదే చెబుతుండే.. 'నవ్వెటోళ్ల ముందట జారిపడొద్దని'. మరి అది చాలా టఫ్ జాబ్. కానీ అలాంటి టఫ్ జాబ్‌ను చేసి చూపించటంలో కేసీఆర్ గ్రాండ్ సక్సెస్ అయ్యారు. అందుకే కేసీఆర్ ఎప్పుడూ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. తెలంగాణ సాధించటంతో పాటు పునర్నిర్మాణం, ఇక్కడ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన కేసీఆర్‌పై కూడా ప్రజలు అంతే ప్రేమ చూపిస్తుంటారు.

తెలంగాణ ఉద్యమం నాటి నుంచి ఇప్పటి వరకు కూడా ప్రజలతో...కేసీఆర్ ప్రేమబంధం ఇసుమంత కూడా చెక్కుచెదరలేదు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు కేసీఆర్‌తో ఒక్కశాతం కూడా సరితూగలేరు. మూడోసారి కూడా కేసీఆర్‌కు ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేదు. అందుకే ఎవరెన్ని అనుమానాలు వ్యక్తం చేసినా దాదాపు అంతా సిట్టింగ్‌లకే సీట్లు ప్రకటించేశారు.

ఆ తర్వాత కొంచెం గ్యాప్ ఇచ్చారు. అంతే ఈ గ్యాప్‌లో 'ఈసారికష్టం, అబ్బో ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటూ' పిడికెడు మంది కాంగ్రెస్, బీజేపోళ్లు ప్రచారం స్టార్ట్ చేశారు. కానీ కేసీఆర్ రంగంలోకి దిగి రోజుకో రెండు బహిరంగ సభల్లో పాల్గొంటూ ప్రతిపక్షాలను నిద్ర పోనివ్వటం లేదు. అందుకే మూడోసారి కూడా కేసీఆర్ ముఖ్యమంత్రి కావటం ఖాయమని ఇప్పటికే నిర్ణయమైంది. హిస్టరీ రిపీట్స్ అంటే ఇదే.

రచ్చ దినేష్
8978740475

మహిళాభ్యుదయానికి పెద్దపీట

భారత రాష్ట్ర సమితి మహిళాభ్యుదయ దిశా నిర్దేశంలో తనదైన శైలిని కలిగి ఉన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళలకోసం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ఎంచుకున్న సంక్షేమ పథాన్ని ధృవీకరిస్తున్నవి. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి ప్రభుత్వం అమలు పరిచిన కార్యక్రమాలు మహిళలకు అందిస్తున్న చేయూతకు అద్దం పడుతున్నాయి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ అమలుకు బిల్లు ప్రతిపాదించిన సందర్భంలో భారత జాగృతి నాయకురాలు కల్వకుంట్ల కవిత పోషించిన క్రియాశీల పాత్ర మహిళాభ్యుదయానికి బీఆర్ఎస్ ఎంతగా పాటు పడుతుందనేది చెప్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమికను పోషించిన మహిళలకోసం తెలంగాణలో ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు పరిచిన పథకాలు అనిర్వచనీయమైనవి. మహిళను సమాజ పరిణామ క్రమంలో ముందుకు తీసుకుపోయేందుకు ప్రభుత్వం అమలు చేసిన ప్రోత్సాహకాలు ఇక్కడ ఉదహరించాలి. బాలికా స్థాయినుంచే ఈ ప్రోత్సాహకాలు రాష్ట్రంలో అమలవుతున్న తీరు బాలికా విద్యను ముందుకు తీసుకుపోయే రీతిలో ఉపకరించాయి. విద్యార్థి దశలో బాలికా విద్య కొనసాగింపునకు ప్రేరణగా అమలైన పథకాలు యుక్తవయసులో ఆడ పిల్ల పెండ్లికి తెలంగాణలో వినూత్నంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లు మహిళా సంక్షేమానికి ఊతంగా ప్రభుత్వం చూపే చొరవకు తార్కాణంగా నిలిచాయి.

చదువు, పెండ్లి రెంటికీ ఆడపిల్లలున్న కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న సహకారం దేశ చరిత్రలో వినూత్న అధ్యాయానికి తెరలేపింది. ప్రభుత్వ దవాఖానాల్లో డెలివరీ అయిన మహిళలకు కేసీఆర్ కిట్ పేరిట అందించే ప్రోత్సాహకం బహుళ ప్రయోజనాలకు నాందిగా నిలుస్తున్నది. కేసీఆర్‌కిట్ వంటి వినూత్న ప్రోత్సాహకం దేశ చరిత్రలోనే ఒక గొప్ప పథకంగా నిలిచింది. దీనివల్ల ప్రభుత్వ దవాఖానాల్లో డెలివరీలు పెరిగాయి. దీనికి తోడు గర్భిణుల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న న్యూట్రిషన్ కిట్ కూడా మహిళా ఆరోగ్యంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు తార్కాణంగా నిలుస్తున్నది.

ఇవన్నీ విద్య, ఆరోగ్య, కుటుంబ పరమైన ప్రోత్సాహకాలుగా నిలుస్తున్న దశలోనే వివిధ రంగాల్లోని మహిళలు పొందుతున్న ఆర్థిక సహాయాలు మహిళలకు ఆసరాగా నిలుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పథకం, ఒంటరి మహిళ, వితంతు పింఛన్ పథకాలు మహిళ తనకాళ్లపై తాను నిలబడే రీతిలో ఉపకరిస్తున్నవి. మహిళారైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే కుటుంబ పోషణలో భాగస్వామిగానే కాకుండా ప్రధాన భూమికను పోషించే తరహాలో బీఆర్ఎస్ రూపొందించి అమలు చేస్తున్న పథకాలు మహిళలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకంలోనూ మహిళది కీలక భూమిక. తమ కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషించే మహిళ వంటింటి అవసరాల కోసం పలు రాయితీలను అమలు పరుస్తున్న కేసీఆర్ ప్రభుత్వం ఈసారి రెండు వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. పేద కుటుంబాలకు 4 వందలకే గ్యాస్ సిలిండర్లను అందించనున్నట్టు ప్రకటించింది. అలాగే పేద మహిళలకోసం సౌభాగ్య లక్ష్మి పేరిట అమలులోకి తీసుకురానున్న మరో పథకం బీఆర్ఎస్‌ను ఆకాశానికెత్తింది.

ఈ పథకం ద్వారా మహిళకు ప్రతినెల రూ.3 వేలను ప్రోత్సాహకంగా అందజేస్తామని బీఆర్ఎస్ హామీనిస్తున్నది. ఇది మహిళలకు ఆర్థిక శక్తినిచ్చే గొప్ప పథకం. ఇలా అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నింటా మహిళలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నది.

డాక్టర్ కడియం కావ్య
98858 56065

మూడోసారి బీఆర్ఎస్ సర్కార్

తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావడానికి సంపూర్ణ అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు, మేధావి వర్గం భావిస్తున్నది. గత రెండు పర్యాయాలు విజయవంతంగా పూర్తి చేసుకొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనా అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడి ముందుకు పోతూ సబ్బండ వర్గాల వారి సంక్షేమానికి కృషి చేస్తున్నది. బీఆర్ఎస్ ఆనాడు ఉద్యమకాలంలో ఇచ్చిన హామీలకు రెట్టింపు అభివృద్ధి చేసి దేశ రాజకీయాల దృష్టి తెలంగాణ వైపు మళ్లే విధంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నది.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్న బీఆర్ఎస్ ఏనాడూ ఓటు బ్యాంకు కోసం పని చేయలేదు. నిరంతరం ప్రజా సంక్షేమానికై కృషి చేసింది. కాబట్టే రెండు పర్యాయాలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చారు తెలంగాణ ప్రజలు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మధ్యనే ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించారు. ఈ మ్యానిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉన్నది. గతంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని పథకాలను కూడా అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కు ఉన్నది. కేసీఆర్‌కు కావాల్సింది కూడా అధికారం కాదు, ప్రజల శ్రేయస్సు. ప్రజల కోసం ఆలోచించే నాయకుడు కాబట్టే ప్రజలు కేసీఆర్‌కు అధికారం ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ ఏర్పాటు నుంచి తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ సమాజం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ద్వారానే సాధ్యమని చెప్తూ వచ్చారు.

అందుకే ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలందరిని ఏకం చేసి తెలంగాణ సిద్ధాంతకర్త, పెద్దలు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ మార్గనిర్దేశంలో ఉద్యమించారు. ఎందరో యువకుల ఆత్మార్పణం, కేసీఆర్ దీక్ష ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగింది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మీకు పరిపాలన చేయడం చేతకాదని ఆనాడు ఆంధ్ర పాలకులు సంకుచిత భావంతో హేళన చేసినా ఎన్నికల కదన రంగంలోకి దూకారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో మొదటిసారి 2014లో అధికారాన్ని చేపట్టి సుపరిపాలన అందించారు.

2018 సాధారణ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించటానికి ఆంధ్ర పాలకులతో తెలంగాణ ప్రతిపక్ష పార్టీలు జట్టు కట్టాయి. పోరాడి సాధించుకున్న తెలంగాణపై మళ్లీ ఆంధ్ర పెత్తనం ఏంటని తెలంగాణ ప్రజలు భారీ ఎత్తున కేసీఆర్‌కు మద్దతు పలుకడంతో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది.

తెలంగాణలో కొందరు నాయకులు ఆనాడు అధికార, ధన ప్రలోభాలకు లోనై ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నం చేశారు. నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ తెలంగాణ ప్రాజెక్టులపై కేసులు వేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ప్రతిపక్ష నాయకులకు కావాల్సింది ప్రజా సంక్షేమం కాదు, అధికారం. దాని కోసం ఎంతదాకనైనా దిగజారి అసత్య ప్రచారాలు చేస్తున్నారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ విషపూరిత ఆరోపణలు చేస్తూ అధికారం కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయి. నేడు అవినీతి కుంభకోణాలలో కూరుకుపోయిన కాంగ్రెస్ తెలంగాణ అవినీతిపై మాట్లాడటం హాస్యాస్పదం. నేడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నది. కానీ తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు వారి మాయ మాటలు నమ్మరు. ఎందుకంటే ఈ రోజు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేక పోతున్నదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈనాడు బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ సరిహద్దు రాష్ట్ర ప్రజలు మమ్మల్ని తెలంగాణలో కలపండని అడుగుతున్న సందర్భాలు చూస్తున్నాం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ లేక రైతులు అరిగోస పడిన చరిత్ర చూసినం. యూరియా బస్తాల కోసం తెల్లవారుజామున మూడు గంటలకు పోయి లైన్లో నిలబడిన రోజులు మర్వలేదు. అవి కూడా అరకొర మాత్రమే వచ్చేవి. తప్పని పరిస్థితుల్లో తోసుకున్న రైతులపై విరిగిన పోలీస్ లాఠీలు, కరెంట్‌కోసం ఎదురు చూస్తూ బోరు బావి దగ్గర కుప్పకూలిన రైతన్నలు ఎందరో. అటువంటి పరిస్థితి నుంచి నేడు తెలంగాణ రైతాంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై కేంద్రబృందాలు అధ్యయనం చేసి ప్రజాశ్రేయస్సుకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ప్రశంసించిన విషయం అందరికీ తెలిసిందే.

ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు సైతం బీఆర్ఎస్ పథకాలను అభినందించిన సందర్భాలు చాలా ఉన్నాయి. తెలంగాణ అభివృద్ధిలో దూసుకు పోతూ వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు, రివార్డులు అందుకున్నది. ప్రపంచంలో ఉన్న ప్రముఖ పారిశ్రామిక కంపెనీలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడం వల్ల ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతున్నాయి.

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో మత కలహాలు, పోలీసు కర్ఫ్యూలు తప్ప అభివృద్ధి ఏ మాత్రం కనిపించేదికాదు. బీఆర్ఎస్ పాలనలో గడచిన పదేండ్ల కాలంలో ప్రశాంతమైన వాతావరణంలో తెలంగాణ ప్రజలందరూ కలిసిమెలిసి సోదరభావంతో జీవిస్తున్నారు.

నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకుండా తాత్సారం చేస్తున్నది. ఇక్కడ ఉన్న ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వకుండా తెలంగాణ రైతులు పండించిన వడ్లను కొనకుండా నూకలు తినండని హేళనగా మాట్లాడిన సందర్భాలను చూశాము. పెండింగ్‌లో ఉన్న రైల్వేలైన్‌లకు నిధులు మంజూరు చేయకుండ జాప్యం చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. బీజేపీ జాతీయ నాయకులు టూరిస్టుల్లా వచ్చి ఇక్కడి స్థానిక నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లి పోతారు తప్ప తెలంగాణ అభివృద్ధికి సహకరించింది లేదు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం కేంద్రం నిధులు ఇవ్వకున్నా, ప్రజా సంక్షేమానికి ఎన్ని అవరోధాలు సృష్టిస్తున్నా వాటన్నింటిని ఎదుర్కొని సమర్థవంతంగా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికై అడుగులు వేస్తున్నది. తెలంగాణ సమాజం కూడా బీఆర్ఎస్ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. అందుకే మరోసారి కేసీఆర్‌కే పట్టం కడుతామని స్పష్టం చేస్తున్నారు.

మిడ్దె సురేష్
97012 09355



కేసీఆర్ అంటే ఒక శక్తి. నాలుగున్నర కోట్ల ప్రజల గొంతుకలను ఒకటి చేసి, ఊరు వాడను ఏకం చేసిన ప్రజానాయకుడు. తన ప్రాణాలను అడ్డుపెట్టి ఢిల్లీ ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణను సాధించిన మహాశక్తి కేసీఆర్. సాధించిన రాష్ట్రాన్ని జలహారం చేసి, పచ్చని పొలాలతో, ధాన్యరాశులతో దేదీప్యమానంగా మార్చిన తెలంగాణ జాతిపిత మన కేసీఆర్. ఆయన దూరదృష్టిని, తెలంగాణ అభివృద్ధిని, కేసీఆర్‌కు ప్రజల మీదున్న ప్రేమను చూసి తట్టుకోలేక బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకులు అర్థం లేని ఆరోపణలు, పసలేని ప్రసంగాలతో తెలంగాణ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు.

అసత్య ఆరోపణలు పసలేని ప్రసంగాలు

విభజన చట్టంలోని హామీలను ఒక్కటంటే ఒక్కటి తీర్చలేదు మోదీ ప్రభుత్వం. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదు. తెలంగాణకు ఒక్క వైద్య కళాశాల ఇవ్వలేదు. ఒక్క నవోదయ ఇవ్వలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ అండ్ సైన్స్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ ఇవ్వలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే మోదీ తెలంగాణకు చేసింది జీరో. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణ తలసరి ఆదాయంలో ముందున్నది కాదని నిరూపించగలరా మోదీ భజన బ్యాచ్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎంతో అభివృద్ధి చేశాం, ఇన్ని పథకాలు పెట్టాం. రేపు అధికారంలోకి వస్తే తెలంగాణలోనూ చేస్తామని చెప్పే ధైర్యం లేదు బీజేపీ నాయకులకు. కానీ ఎలక్షన్లు రాగానే తెలంగాణ మీద కపట ప్రేమ చూపిస్తూ కేసీఆర్ మీద పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తున్నారు తెలంగాణ బీజేపీ మిడతల దండు. ఈ మిడతల దండును ప్రజలు నమ్మట్లేదని కేంద్ర దండు నాయకులైన మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, జేపీనడ్డా, తెలంగాణ మీద పడి అసత్య ఆరోపణలతో, పచ్చి అబద్ధాలతో దేశ అభివృద్ధిని పక్కన పెట్టి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. కానీ కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి, దేశ ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని ముందుకు పోతున్నారు. పదవి కాంక్షతో కేసీఆర్‌ను అప్రతిష్ట పాలు చేయడానికి ఎన్ని ఆరోపణలు చేసినా తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉంటుంది.

మరొక ఆరోపణ కేసీఆర్ దళితున్ని ముఖ్యమంత్రి చేయలేదు. పోనీ బీజేపీ అధికారంలోకి వస్తే దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తారా. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితుల మీద, దళిత మహిళల మీద హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. దళితులు గుడిలోకి వస్తే గుడిని శుభ్రం చేసే ఆచారాలను పాటిస్తున్నది బీజేపీ. దళిత రాష్ట్రపతిని అవమానించిన చరిత్ర బీజేపీది. తెలంగాణకు తలమానికమైన నూతన సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించినవారు సీఎం కేసీఆర్. భావితరాలకు ఆ మహనీయుని గొప్పతనం తెలిసేలాగ 125 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి, దళితుల సంక్షేమం కోసం దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్న అభినవ అంబేద్కర్ కేసీఆర్.

మరొక ఆరోపణ కుటుంబ పాలన. బుద్ధిలేని బీజేపీ నాయకుల్లారా దొడ్డి దారిన కేసీఆర్ తన కుటుంబానికి పదవులు ఇవ్వలేదు. ప్రజలకు సేవ చేసి, ప్రజల మనస్సును దోచుకొని, ప్రజాస్వామ్య బద్ధంగా పోటీ చేసి గెలిచారు. దీన్ని కుటుంబ పాలన అంటే ఎలా. పోనీ ఇది కుటుంబ పాలనే అనుకుందాం. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుమారుడు పంకజ్ సింగ్ ఎమ్మెల్యే. కర్ణాటక సీఎం యడియూరప్ప కుమారుడు విజయేంద్ర బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మరో కుమారుడు రాఘవేంద్ర ఎంపీ. మాజీ సీఎం వసుంధర రాజే కుమారుడు దుష్యంత్ సింగ్ ఎంపీ. హిమాచల్ ప్రదేశ్ మాజీ సీఎం ప్రేమ్‌కుమార్ ధుమాల్ కుమారుడు అనురాగ్ ఠాకూర్ కేంద్ర మంత్రి. ఎంపీ మేనకా గాంధీ కుమారుడు వరుణ్ గాంధీ ఎంపీ. తేజస్వి సూర్య మేనమామ రవి సుబ్రమణ్య ఎమ్మెల్యే. మాజీ ప్రధాని దేవెగౌడ తన కుమారుడైన కుమారస్వామిని ముఖ్యమంత్రి చేశారు. నిన్నటికి నిన్న కర్ణాటకలో దేవెగౌడ కుటుంబం నుంచి కుమారస్వామిని ఎన్డీఏలో చేర్చుకున్నారు. చంద్రబాబు నాయుడు కొడుకు లోకేశ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని అనుకోవటం లేదా. ప్రకాశ్‌సింగ్ బాదల్ కొడుకును ఉపముఖ్యమంత్రిని చేయలేదా. ఇవ్వన్ని కుటుంబ పాలన కిందకు రావా? కేవలం బీజేపీ తప్పుడు సిద్ధాంతాలను ప్రశ్నించే కేసీఆర్ కుటుంబమొక్కటే కుటుంబ పాలన చేస్తున్నదా?

ఎప్పుడూ కేసీఆర్ మీద పడి ఏడవడమే తప్ప ఈ ప్రాంతానికి ఈ పని చేస్తం అని చెప్పి ఓట్లు అడిగే దమ్ము, ధైర్యం లేని దండుపాళ్యం బ్యాచ్ బీజేపీ నాయకులు. మరోవైపు బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే అని ఆరోపిస్తున్నారు. ఒక్కటే అయితే తప్పేంటి. తెలంగాణలో హిందూ, ముస్లింలు కలిసి మెలిసి జీవిస్తారు. మొన్నటికి మొన్న వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఒకటే రోజు రావడంతో ముస్లిం మత పెద్దలు వారికి వారే నిర్ణయం తీసుకొని వారి పండుగను వాయిదా వేసుకున్నారు. బీజేపీ ఎజెండా ఒక్కటే హిందూ, ముస్లింల మధ్య మతకల్లోహాలు సృష్టించి, ఘర్షణలు రేపి ఓట్లు దండుకోవాలని. కానీ ఆ పప్పులు తెలంగాణలో ఉడుకవనే సంగతి మోదీకి, ఆయన భజన బ్యాచ్‌కి తెలియదు.

మరోవైపు బీజేపీకి బీ టీం బీఆర్ఎస్ అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నది. నిజానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చేయాల్సిన పనిని బీఆర్ఎస్ చేస్తుంటే ఇలాంటి ఆరోపణలు చేయటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం కోసం కాంగ్రెస్‌తో పద్నాలుగేండ్లు పోరాడిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంతో పోరాడుతున్న చరిత్ర కూడా బీఆర్ఎస్‌దే. దీన్నిబట్టి ఎవరు ఎవరికీ ఏ టీమో ప్రజలే నిర్ణయిస్తారు.

తెలంగాణ ప్రజలు విజ్ఞులు, పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తు ప